

మహిళలకు అవార్డులను అందజేస్తున్న సుప్రీంకోర్టు న్యాయవాది డాక్టర్ ఉపాధ్యాయ తదితరులు

మహిళలు విద్య, ఆర్థిక, రాజకీయ రంగాల్లో రాణించాలి

బర్కత్‌పుర, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మహిళలు విద్య, ఆర్థిక, రాజకీయ రంగాల్లో రాణించినప్పుడే దేశాభివృద్ధి అని సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది డాక్టర్ ఉపాధ్యాయ అన్నారు. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో సౌత్ ఇండియా అడ్వకేట్ జేఏసీ ఆధ్వర్యంలో మహిళలకు అవార్డులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ మహిళాశక్తిని గుర్తించి గౌరవించినప్పుడే సమాజం ప్రగతిపథంలో ముందుకు సాగుతుందన్నారు. హైకోర్టు న్యాయవాది నవీన్‌రాజ్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను ఎదుర్కొనేందుకు ప్రతి బాలిక తప్పనిసరిగా కరాటే, కర్రసాము, విలు విద్యలో శిక్షణ పొందాలని కోరారు. అడ్వకేట్ జేఏసీ అధ్యక్షుడు సుధానాగేందర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ జయసుధచౌదరి, డాక్టర్ సీతారామ్‌కుమారి, పరమేశ్వరీని శాలువా, మెమొంటో, పూలబొకేలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మేధావుల ఫోరం అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌నారాయణ ముదిరాజ్, హైకోర్టు న్యాయవాదులు శ్రీధర్, వెంకటేశ్వర్లు, సతీష్, వర్షిత, మానస, నిందిత, వైష్ణవి, వాణి, చందన, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నందిని సిధారెడ్డి

'నా ఊహాలోకం' కథలు ముందుతరాలకు సందేశం

చిక్కడపల్లి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): నా ఊహాలోకం కథలు ముందుతరాలకు సందేశంగా నిలుస్తాయని ప్రముఖ సాహితీవేత్త డా.నందిని సిధారెడ్డి అన్నారు. బంధుత్వాలలో తప్పులను గుర్తుంచుకుంటే అనుబంధాలు మిగలవని మనుషులుగా కూడా గుర్తింపు కోల్పోతారని ఆయన పేర్కొన్నారు. తపస్వి మనోహరం, మయూఖ అంతర్జాతీయ పత్రిక ఆధ్వర్యంలో కట్టెకోల విద్యుల్లత రచించిన 'నా ఊహాలోకం' కథా సంపుటి ఆవిష్కరణ సభ శనివారం రాత్రి త్యాగరాయగాన సభలో జరిగింది. పుస్తకాన్ని సిధారెడ్డి ఆవిష్కరించగా కొండపల్లి నీహారిణి, డా.నాశేశ్వరం శంకరం, అవధానులు విజయలక్ష్మి, జగన్నాథరావు, సంస్థస్థాపకుడు కార్తీక్‌నిమ్మగడ్డ, గేయ రచయిత గోపాల్ ఆచార్య పాల్గొన్నారు. విద్యుల్లత తన సంపుటిని తల్లిదండ్రులు కట్టెకోల యాదగిరిరావు దంపతులకు అంకితమిచ్చారు.



పురస్కార గ్రహీతలతో అతిథులు, నిర్వాహకులు

తమ ఆధిక్యతను మహిళలు గుర్తించడం లేదు

చిక్కడపల్లి, మార్చి 9(ఆంధ్రజ్యోతి): తరతరాలుగా మహిళలు పురుషుల కన్నా ఆధిక్యంగా ఉన్నా కూడా వారికి వారు ఆ విషయాన్ని గుర్తుంచుకోవడంలేదని కేంద్రమాజీ మంత్రి డా.సముద్రాల వేణుగోపాలచారి అన్నారు. మహిళా నాయత్వం అన్ని రంగాల్లో విజయాన్ని సాధిస్తుందన్నారు. కళాదర్బార్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి త్యాగరాయగానసభలో వివిధ రంగాలకు చెందిన ప్రముఖ మహిళలకు ఝాన్సీలక్ష్మీబాయి నారీశక్తి పురస్కారాలను ప్రదానం చేశారు. సబిత, శశిబాల, సాయిసుధ, నాగజ్యోతి, అనురాధ, సౌమ్యచందకు పురస్కారాలను బహూకరించారు. ప్రముఖనాట్యగురువు స్వాతిసోమనాథ్, ఆర్.వెంకటేశ్వరరావు, రఫీ, సంస్థస్థాపకుడు పొత్తూరి రంగారావు, త్రినాథరావు, సురేష్, అనూష, శ్రీదేవి పాల్గొన్నారు.

డ్రగ్స్ నియంత్రణకు ప్రభుత్వం కృషి : ఎమ్మెల్సీ వెంకట్



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్

నల్లకుంట, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్రంలో డ్రగ్స్, గంజాయి, మాదకద్రవ్యాలు నియంత్రించడంలో రాష్ట్ర ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నదని ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్ అన్నారు. శనివారం ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ హైదరాబాద్ కమిటీల ఆధ్వర్యంలో నగరంలోని సంస్థ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో షహీద్ భగత్‌సింగ్ యువజన ఉత్సవాల వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నగర అధ్యక్ష, కార్యదర్శులు లెనిన్, అశోక్ రెడ్డి, డీవైఎఫ్ఐ అధ్యక్ష, కార్యదర్శులు హష్మీబాబు, జావీద్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఎంపీ నియోజకవర్గాల మాదిగ సమ్మేళనం

తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా 17 ఎంపీ నియోజకవర్గాల స్థాయి మాదిగ సమ్మేళనం ఆదివారం నుంచి ప్రారంభమవుతుందని, ముందుగా జహీరాబాద్ నుంచి ఉంటుందని డాక్టర్ పిడమర్తి రవి తెలిపారు. మాదిక సమ్మేళనానికి మాదిగలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాదిగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గడ్డ యాదన్న, జాతీయ ఉపాధ్యక్షుడు బుదాల బాబురావు, ఎమ్మార్పీఎస్ నాయకులు మర్మాల మల్లేష్, నర్సింగ్‌రావు, జలజ దండు, మొగులయ్య, బోరెల్లి సురేష్, నక్క మహేష్, చింతయ్య, ధర్మేందర్, సంజీవ్, రాములు, విజయ్ ప్రసాద్ పాల్గొన్నారు.

పేదల పక్షాన పోరాటయోధుడు రాయల సుభాష్‌చంద్రబోస్ : వక్తలు



రాయల సుభాష్‌చంద్రబోస్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న హన్మేష్, ఎస్ఎల్.పద్మ తదితరులు

రాంనగర్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీలు, గిరిజనులు, పేద ప్రజల సమస్యల పరిష్కారం కోసం పోరాడిన పోరాటయోధుడు రాయల సుభాష్‌చంద్రబోస్ (రావన్న) అని పలువురు వక్తలు పేర్కొన్నారు. శనివారం విద్యానగర్‌లోని మార్క్స్ భవన్‌లో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో రాయల సుభాష్‌చంద్రబోస్ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఐఎఫ్‌టీయూ జాతీయ ఉపాధ్యక్షుడు పి.ప్రసాద్, నాయకులు బి.ప్రదీప్, రాష్ట్ర ఉపాధ్యక్షులు అరుణ, సత్యనారాయణ, పీడీఎస్‌యూ నాయకులు మహేష్, గడ్డంశ్యామ్, గణేష్ తదితరులు పాల్గొని రావన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శి ఎం.హన్మేష్, ఎస్.ఎల్.పద్మ తదితరులు కూడా రావన్నకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వరలక్ష్మి, లక్ష్మీబాయి, అనిల్, కృష్ణ రవికిరణ్, అఫ్జల్, రవి, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర, అంతర్ జిల్లాల క్యారమ్ పోటీలు ప్రారంభం



క్యారమ్ పోటీలను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ నర్సింహారెడ్డి

రాంనగర్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర 51వ రాష్ట్ర, అంతర్ జిల్లా క్యారం పోటీలు తెలంగాణ రాష్ట్ర క్యారమ్ అసోసియేషన్, రంగారెడ్డి, మెదక్, మల్కాజ్‌గిరి జిల్లాల క్యారం అసోసియేషన్ల ఆధ్వర్యంలో ప్రగ్నాఆస్పత్రి సౌజన్యంతో శనివారం మన్సూరాబాద్‌లోని మల్లికార్జున్‌నగర్‌లో ప్రారంభమయ్యాయి. ఈ మేరకు అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మదన్‌రాజు, ఉపాధ్యక్షులు ప్రవీణ్‌కుమార్, కార్యనిర్వాహక కార్యదర్శి శోభన్‌రాజు శనివారం తెలిపారు. ఈ కార్యక్రమాన్ని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి హాజరై ప్రారంభించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు ఉప్పు సుధాకర్, సాయికృష్ణ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించినప్పుడే సమాజాభివృద్ధి

ప్రోగ్రెసిస్ సైకాలజిస్ట్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షురాలు డాక్టర్ హిప్నో పద్మకమలాకర్



బాలలతో డాక్టర్ హిప్నో పద్మకమలాకర్

కవాడిగూడ, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో రాణించినప్పుడే సమాజాభివృద్ధి సాధ్యం అని ప్రోగ్రెసిస్ సైకాలజిస్ట్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షురాలు డాక్టర్ హిప్నో పద్మకమలాకర్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం లోయర్‌ట్యాంక్‌బండ్ లోని రామకృష్ణమఠంలో యోగానంద రఘుమహారాజు, నవభారత లయన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో బాలల సేవా విభాగంలో మహిళల సమస్యలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పిల్లలకు మహిళా ఫ్రీడమ్ ఫైటర్స్ పుస్తకాలు, పండ్లు, పోష్టికాహారం అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మహిళల వెనుకబాటు తనం ఇంకా తగ్గలేదన్నారు. చిన్నతనంలోనే పిల్లలకు మహి ళల సమస్యలపై చెప్పడం వల్ల అవి తగ్గడానికి అవకాశం ఉంటుందన్నారు. 2030 నాటికి 842 కోట్ల కంటే ఎక్కువ మంది మహిళలు, బాలికలు అత్యంత పేదరికంలో జీవించే పరిస్థితి ఉంటుందని ఐక్యరాజ్యసమితి నివేదికలు పేర్కొంటున్నాయని అన్నారు. దీనిని నిర్మూలించాలంటే మహిళల ఆరోగ్యం సంక్షేమం, అభివృద్ధి సామాజిక భద్రతకు మరిన్ని వనరులను సమకూర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో జి.కృష్ణవేణి, హారతి, బాలబాలికలు పాల్గొన్నారు.

మహిళా జర్నలిస్టులకు కేర్ ఆస్పత్రిలో వైద్య శిబిరం

ముషీరాబాద్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ముషీరాబాద్ కేర్ ఆస్పత్రిలో శనివారం నుంచి మహిళా జర్నలిస్టులకు స్వల్ప రుసుంతో ఈనెల 31 వరకు వివిధ రకాల వైద్య పరీక్షలను నిర్వహించనున్నట్లు ముషీరాబాద్ కేర్ ఆస్పత్రి మీడియా సెల్ ఇన్‌చార్జి సతీష్ తెలిపారు. జర్నలిస్టుల కుటుంబాలకు చెందిన మహిళలు, మహిళా జర్నలిస్టులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ వైద్య శిబిరంలో ర్యాండమ్ బ్లడ్‌షుగర్, బీపీ, ఈఎస్ఆర్, రక్త పరీక్షలు, యూరిన్ పరీక్షలు, థైరాయిడ్, అల్ట్రాసౌండ్, బ్రెస్ట్ ఎగ్జామినేషన్, మహిళలకు తదితర వ్యాధులను ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్లు పరీక్షలు నిర్వహిస్తారని ఆయన తెలిపారు.



మహిళలకు అవార్డులను ప్రదానం చేస్తున్న హిందీ ప్రచారసభ అధ్యక్షుడు గైబువల్లి

మహిళలకు అవార్డుల ప్రదానం

బర్కత్‌పుర, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో రాణించినప్పుడే సాధికారత సాధ్యం అని హిందీ ప్రచార సభ హైదరాబాద్ అధ్యక్షుడు ఎస్.గైబువల్లి అన్నారు. శనివారం హిందీ ప్రచార సభ ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో రాణిస్తున్న మహిళలకు అవార్డులను ప్రదానం చేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు జె.వెంకటరావు, నర్సింహారెడ్డి, మహాపాత్రుడు, శృతికాంత్, భారతి, మహిళా ప్రముఖులు నీలా మహంతి, విజయ, మాధురి, తెలంగాణ హిందీ ప్రచార సభ అధ్యక్షుడు రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు : ఎమ్మెల్యే గోపాల్



డీఎస్ నగర్‌లో పవర్‌బోర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గోపాల్

ముషీరాబాద్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): రాబోయే వేసవికాలంలో నీటి సమస్య తలెత్తకుండా యుద్ధప్రాతిపాదికన చర్యలు తీసుకుంటున్నామని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. శనివారం బోలక్‌పూర్ డివిజన్‌లోని డీఎస్‌నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన పవర్‌బోర్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... స్థానికంగా ఉన్న అధ్వానపు రోడ్డు వల్ల ప్రజలు ప్రమాదాలకు లోనవుతున్నారని త్వరలో రోడ్డు నిర్మాణ పనులు చేపడుతామని తెలిపారు. నాలా పరీవాహక ప్రాంత ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రహరీ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. పెండింగ్‌లో ఉన్న కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రేటర్ హైదరాబాద్ యువజన కమిటీ సీనియర్ నాయకుడు ముఠా జైసింహా, బోలక్‌పూర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు, ఉపాధ్యక్షుడు శంకర్ గౌడ్, మీడియాసెల్ ఇన్‌చార్జి ముచ్చకుర్తి ప్రభాకర్, నాయకులు గోవింద్, కృష్ణ, మహేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పవర్‌బోర్ వాడినందుకు విద్యుత్ బిల్లులు

డీఎస్ నగర్‌లో స్థానికంగా వేసిన పవర్‌బోరింగ్‌కు విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ బిల్లులు ఇస్తున్నారని స్థానికులు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. ఈ బిల్లులు తాము చెల్లించలేమని, తమకు ఉచితంగా నీటి సరఫరా జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. స్పందించిన ఎమ్మెల్యే డీఈతో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.



కోర్టు కానిస్టేబుళ్లతో సమీక్ష చేస్తున్న చిక్కడపల్లి ఏసీపీ రమేష్‌కుమార్

కోర్టు కేసుల్లో అప్రమత్తంగా ఉండాలి: ఏసీపీ

చిక్కడపల్లి, మార్చి 9(ఆంధ్రజ్యోతి): కోర్టు కేసుల్లో అప్రమత్తంగా ఉండాలని చిక్కడపల్లి ఏసీపీ ఎల్ రమేష్‌కుమార్ సూచించారు. శనివారం సాయంత్రం తనచాంబర్‌లో చిక్కడపల్లి ఏసీపీ డివిజన్ పరిధిలోని చిక్కడపల్లి, ముషీరాబాద్ కోర్టు కానిస్టేబుళ్లతో ఆయన సమీక్షాసమావేశం నిర్వహించారు. కోర్టు రెఫర్ కేసుల విషయంలో జాగ్రత్తగా ఉండాలని ఏసీపీ కోర్టు కానిస్టేబుళ్లకు సూచించారు. పీఎస్‌లకు సంబంధించి కేసులు కోర్టులో పెండింగ్‌లో ఉన్నవాటిని వెంట వెంటనే పూర్తిచేసుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా రెండు స్టేషన్ల పరిధిలో ఎన్ని కోర్టు కేసులు పెండింగ్‌లో ఉన్నాయి? ఎన్ని కేసులు లోక్ అదాలత్‌లో పరిష్కరించబడ్డాయి? లేటెస్ట్ కేసులు ఏంటి? వంటి విషయాలను ఆయన కోర్టు కానిస్టేబుల్లు, ఎస్‌హెచ్‌వోలు ఏరుకొండ సీతయ్య, రవిని అడిగి తెలుసుకున్నారు.



నిమ్మరసం ఇచ్చి రిలేదీక్ష విరమింపచేస్తున్న నవీన్‌గౌడ్

75 సంవత్సరాల నుంచి నివసిస్తున్న ఇళ్లను కూల్చడం అన్యాయం

చిక్కడపల్లి, మార్చి 9(ఆంధ్రజ్యోతి): 75 సంవత్సరాలుగా దళితులు నివసిస్తున్న ఇళ్లను కోర్టు ఉత్తర్వుల పేరిట ఎలాంటి ప్రత్యామ్నాయం చూపకుండా కూల్చివేయడం అన్యాయమని, దారుణమని ముషీరాబాద్ అసెంబ్లీ బీజేపీ కోకన్వీనర్ ఎం.నవీన్‌గౌడ్ ఆరోపించారు. గాంధీనగర్ డివిజన్ స్వామివివేకానందనగర్ బస్తీ బాధితుడు వసంత్‌కుమార్ శనివారం రిలే దీక్ష చేపట్టారు. దీక్షను సాయంత్రం విరమింపచేసిన నవీన్‌గౌడ్ దీక్షలకు తమ సంఘీభావం ప్రకటించారు. ఎంటీ.కృష్ణ, ఆనంద్‌రావు, జ్ఞానేశ్వర్, సంపత్‌కుమార్, సునీత, ఇందు, పూజారేఖ, బాధితులు దీక్షలో పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్

అత్యాచార నిరోధక చట్టం 1989ను పరిరక్షించాలి

రాంనగర్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): షెడ్యూల్డ్ కులాలు, తెగల అత్యాచార నిరోధక చట్టం 1989 పటిష్ట అమలు కోసం, చట్టాన్ని పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్ సూచించారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సిటిజన్స్ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ (సీవీఎంసీ) తెలంగాణ రాష్ట కమిటీ సమావేశం జరిగింది. దళిత బహుజన శ్రామిక యూనియన్(డీబీఎస్‌యూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.నర్సింహ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్, రిటైర్డ్ ఐఏఎస్‌లు సి.గోపాల్‌రావు, జేబీ రాజు, సీడబ్ల్యూసీ మాజీ చైర్మన్ శ్యామలాదేవి, రిటైర్డ్ అడిషనల్ ఎస్పీ ఆనందం, దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి శంకర్, దళిత వేదిక నాయకుడు రాంచందర్ మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ చట్టాన్ని పరిరక్షించుకోవడం, దాని అమలు సక్రమంగా జరిగేలా చూడాలనే లక్ష్యంతో సిటిజన్స్ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ ఏర్పాటు చేస్తున్నామన్నారు. దళితులకు పొలిటికల్ ఫోర్స్ లేకపోవడం వల్లే అట్రాసిటీ యాక్ట్ సక్రమంగా అమలు కావడం లేదన్నారు. ఈ సమావేశంలో వివిధ సంఘాల నాయకులు శివలింగం, స్వరూప, నవీన్, జ్యోతిరమేష్, చలపతిరావు, రాంచందర్ పాల్గొన్నారు.

ఎంపీ ఎన్నికల్లో బీజేపీ విజయమే లక్ష్యంగా పనిచేయాలి



మాట్లాడుతున్న డాక్టర్ గౌతమ్‌రావు

బర్కత్‌పుర, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : ఎంపీ ఎన్నికల్లో బీజేపీ విజయమే లక్ష్యంగా కార్యకర్తలు సైనికుల వలే పనిచేయాలని బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు పిలుపునిచ్చారు. మోదీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికీ తీసుకెళ్లాలని కోరారు. శనివారం బర్కత్‌పురలోని నగర కార్యాలయంలో అంబర్‌పేట నియోజకవర్గం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 12న హోంమంత్రి అమిత్‌షా రాష్ట్రానికి వస్తున్న సందర్భంగా నిర్వహించే బూత్ అధ్యక్షుల విజయ సంకల్ప సమ్మేళనాన్ని విజయవంతం చేయాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్త, నాయకుడిపై ఉందన్నారు. ఈ నెల 11న మోదీ ప్లకార్డులతో ప్రదర్శన ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కన్నె ఉమాదేవి, వై.అమృత, మాజీ కార్పొరేటర్ అడపా చంద్రమౌళి, నాయకులు కన్నె రమేష్‌యాదవ్, శ్యామ్‌రాజ్, ఎడెల్లి అజయ్‌కుమార్, సి.కృష్ణగౌడ్, చిట్టి శ్రీధర్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



మాట్లాడుతున్న ఆనంద్‌గౌడ్

నల్లకుంట, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రవేశ పెట్టిన ప్రజా సంక్షేమ పథకాలను ప్రజాబాహుళ్యంలోకి తీసుకెళ్లాలని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జి.ఆనంద్‌గౌడ్ పార్టీ శ్రేణులకు సూచించారు. శనివారం నల్లకుంట డివిజన్‌లోని ఇందిరానగర్‌లో బీజేపీ ఓబీసీమోర్చా ఆధ్వర్యంలో కుల సంఘాల సామాజిక సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ వచ్చే ఎంపీ ఎన్నికల్లో బీజేపీ విజయమే లక్ష్యంగా పార్టీశ్రేణులు ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో నల్లకుంట కార్పొరేటర్ వై.అమృత, ఓబీసీ మోర్చా నగర అధ్యక్షుడు వినోద్‌యాదవ్, బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎం.మధుసూదన్‌యాదవ్, నందకుమార్‌యాదవ్, ఎస్.వెంకటస్వామిగౌడ్, ఎం.బి.కిషోర్‌కుమార్, డి.వెంకటేష్, పెంటం ధర్మేందర్, వీరయ్యగౌడ్, మధు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన మహాశివరాత్రి ఉత్సవాలు



శివాలయంలో శివపార్వతుల కల్యాణం చేస్తున్న అర్చకులు

ముషీరాబాద్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి ఉత్సవాలు శనివారం ముగిశాయి. బోలక్‌పూర్ భవానీశంకర దేవాలయంలో శనివారం తెల్లవారు జాము 5గంటల నుంచి స్వామికి రుద్రాభిషేకంతో పూజలు ప్రారంభించారు. ఈ సందర్భంగా నానా ఫలరసాభిషేకాలు, తైలాభిషేకం, అన్నాభిషేకం, చండీహోమం, సాయంత్రం స్వామికి వసంతోత్సవ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర నాయకులు ఆర్ విశ్వం, జమాల్‌పురి నందు, సుందర్, ఆలయ కమిటీ చైర్మన్ ఆర్.శ్రీనివాస్ పాల్గొన్నారు.

వైభవంగా కల్యాణం

చిక్కడపల్లి: మహాశివరాత్రి సందర్భంగా శుక్రవారం అర్ధరాత్రి తర్వాత చిక్కడపల్లి శ్రీ ఆంజనేయ స్వామి ఆలయ ఆవరణంలోని శివాలయంలో శివపార్వతుల కల్యాణమహోత్సవాన్ని కనులపండుగగా నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున హాజరై కల్యాణ మహోత్సవాన్ని తిలకించారు. ఆలయ ఈవో మాచర్ల దేవనాథం ఆధ్వర్యంలో అర్చకులు బుగ్గాలక్ష్మీపతిశర్మ, ఆచారి తదితరులు ఏర్పాట్ల ను పర్యవేక్షించారు.

బంధువుల ఇంటికెళ్లిన యువతి అదృశ్యం



నాజియా ఫాతీమా

పహాడిషరీఫ్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): బంధువుల ఇంటికి వెళ్లిన యువతి అదృశ్యమైంది. ఈ ఘటన బాలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... బండ్లగూడ నూరినగర్‌లో ఫరీదాబేగం కమార్తె నాజియాఫాతీమా(19)తో కలిసి ఉంటుంది. ఈనెల 1న షాహీన్‌నగర్‌లో ఉంటున్న పిన్ని షాహీన్ ఉన్నీసా ఇంటికి వెళ్లింది. ఈ నెల 8న పిన్ని ఇంటి నుంచి బయటకు వెళ్లిన నాజియాఫాతీమ సాయంత్రం అవుతున్నా తల్లి వద్దకు రాలేదు. ఆందోళన చెందిన తల్లి ఫరీదాబేగం శనివారం బాలాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

11న ఎమ్మెల్యే వివేక్‌కు సత్కార సభ

బర్కత్‌పుర, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): సమాజ్ సేవక్ ఆధ్వర్యంలో ఈనెల 11న కాంగ్రెస్ ఎమ్మెల్యే డాక్టర్ జి.వివేక్ వెంకటస్వామికి అభినందన సత్కార సభ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు, మాజీ కార్పొరేటర్ ఎస్.గోపాల్‌రావు తెలిపారు. శనివారం కాచిగూడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నింబోలిఅడ్డలోని ఏ.కె. భవన్‌లో సోమవారం సాయంత్రం 5 గంటలకు ఈ అభినందన సభ జరుగుతుందని చెప్పారు.



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పద్మ

డ్రైనేజీ పైప్‌లైన్ పనుల పరిశీలన

నల్లకుంట, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లోని సాయిమధురనగర్ నుంచి తిలక్‌నగర్ క్రాస్ రోడ్స్ వరకు నూతనంగా చేపడుతున్న డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణ పనులను శనివారం కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బి.వెంకటరెడ్డి, జలమండలి ఏఈ మాజీద్, బీఆర్ఎస్ నాయకులు జమ్మిచెట్టి బాలరాజు, శ్రీహరి, సునీల్, రమేష్, మిరియాల, చంద్రమోహన్, కెంచె మహేష్, మిరియాల శ్రీనివాస్, సంజీవ్‌చౌదరి, బాబు తదితరులు పాల్గొన్నారు.



మాదిగల సమ్మేళనం కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న గజ్జల కాంతం తదితరులు

2 ఎంపీ టికెట్లు కేటాయించాలి

కవాడిగూడ, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో మాదిగలకు రెండు పార్లమెంట్ స్థానాలను కేటాయించాలని ప్రజాసంఘాల జేఏసీ చైర్మన్ గజ్జల కాంతం డిమాండ్ చేశారు. శనివారం తెలంగాణ రాష్ట్ర పార్లమెంట్ స్థాయి మాదిగల సమ్మేళనం కరపత్రం ఆవిష్కరణ కార్యక్రమం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ విగ్రహం వద్ద జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ రిజర్వ్ స్థానాల్లో రెండు పార్లమెంట్ స్థానాలను మాదిగ సామాజికవర్గానికి కేటాయించాలన్నారు.

కమ్యూనిటీ హాల్ పనులను పూర్తి చేయాలి

ముషీరాబాద్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): బోలక్‌పూర్ డివిజన్‌లోని పీఎన్‌టీ కాలనీలో కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను వెంటనే పూర్తిచేయాలని బీఆర్ఎస్ గ్రేటర్ హైదరాబాద్ యువజన కమిటీ సీనియర్ నాయకుడు ముఠా జైసింహా అధికారులను డిమాండ్ చేశారు. శనివారం బోలక్‌పూర్ డివిజన్‌లోని పీఎన్‌టీ కాలనీలో స్థానికుల ఫిర్యాదు మేరకు ఆయన జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ బోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు, ఉపాధ్యక్షుడు శంకర్ గౌడ్, పీఎన్‌టీ కాలనీ నాయకులు లత, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి రుద్రాభిషేకం



బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లోని బతుకమ్మకుంటలోని శ్రీమైసమ్మ ఆలయంలో శనివారం అమ్మవారికి రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ కమిటీ చైర్మన్ కోట శివకుమార్, సభ్యులు మాధవి, కిరణ్‌కుమార్, మంజుల, పూజారి సుబ్రహ్మణ్యశర్మ, బస్తీవాసులు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణ నిర్వహించారు.

లక్ష్మీగణపతి ఆలయం చైర్మన్ ఎవరో?

చిక్కడపల్లి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీక్రాస్‌రోడ్ లోని శ్రీలక్ష్మీగణపతి ఆలయ చైర్మన్‌గా ఎవరిని నియమిస్తారనేది చర్చనీయాంశంగా మారింది. గతంలో బీఆర్ఎస్ నేత ముచ్చకుర్తి ప్రభాకర్ చైర్మన్‌గా ఉండగా ఆయన పదవీ కాలం ఎన్నికల కంటే ముందే ముగిసింది. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో ఏర్పడిన నేపథ్యంలో ముషీరాబాద్ కాంగ్రెస్ ఇన్‌చార్జి, టీపీసీసీ వర్కింగ్ అధ్యక్షుడు అంజన్‌కుమార్ యాదవ్ ఆశీస్సులు ఉన్న వ్యక్తికే ఈ చైర్మన్ పదవి దక్కుతుందని సమాచారం. లోక్‌సభ ఎన్నికల అనంతరం నూతన చైర్మన్‌ను నియమించే అవకాశం ఉందని తెలిసింది.

రేపు నవరత్న మహిళా పురస్కారాల ప్రదానం

చిక్కడపల్లి, మార్చి 9(ఆంధ్రజ్యోతి): జీవీఆర్ కల్చరల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 11న త్యాగరాయగానసభలో అంతర్జాతీయ మహిళాదినోత్సవాన్ని పురస్కరించుకుని నవరత్న మహిళాపురస్కారాల ప్రదానసభ నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ చైర్మన్ గుదిబండి వెంకటరెడ్డి తెలిపారు. సీనియర్ జర్నలిస్ట్ భైసదేవదాసు ముఖ్యఅతిథిగా హాజరవుతారని శనివారం ఒక ప్రకటనలో ఆయన పేర్కొన్నారు.



బాకారం బస్తీ కమిటీ ఆధ్వర్యంలో బొమ్మలగుడి వద్ద శనివారం అన్నదాన కార్యక్రమాన్ని రాంనగర్ కార్పొరేటర్ కె.రవిచారి ప్రారంభించారు. కార్యక్రమంలో బాకారంబస్తీ కమిటీ నాయకులు వెంకటేష్, సతీష్‌గౌడ్, సంతోష్, శ్రీనివాసచారి, శేఖర్, లింగం తదితరులు పాల్గొన్నారు. - రాంనగర్, ఆంధ్రజ్యోతి

రైలు ఢీకొని కూలి మృతి

బర్కత్‌పుర, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని కూలి మృతి చెందాడు. కాచిగూడ రైల్వే సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. కందిగల్ గేట్ వద్ద నివాసం ఉంటున్న రాణాప్రతాప్(22) కూలిపని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కందిగల్ గేట్ రైల్వే స్టేషన్ వద్ద పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలు కావడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.